PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు డ్రైవ్‌కు విశేష స్పందన



3లో

జర్నలిస్టుల సంక్షేమం.. హక్కుల సాధనే టీజేఎఫ్ లక్ష్యం....


3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 309 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 02 నవంబర్ 2026

దీపావళికి ముందే ధరల బాదుడు

- వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై మరో రూ.10 పెంపు


2లో

నవంబర్‌లోనూ ఎండల తీవ్రత

● దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు ● వర్షపాతం లోటు తప్పదంటున్న భారత వాతావరణ శాఖ


2లో

దెబ్బతిన్న 48 గంటల్లో విద్యుత్ పునరుద్ధరణ

మురసు తుఫానును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

తెలంగాణ నుంచి 500 మంది సిబ్బంది రాక



అమరావతి,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): మురసు తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు విద్యుత్ శాఖ ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత జిల్లాలకు సిబ్బంది, యంత్రాలు, సామగ్రిని ముందుగానే తరలించాలని సూచించారు. విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్న 48 గంటల్లోనే మిగతా2లో...

ఢిల్లీ వీధుల్లో ఇండియా కూటమి గర్జన!

రాంలీలా మైదానంలో ఓట్ బచావోదేశ్ బచావో సభ

తెలుగు రాష్ట్రాల నుంచి 8 వేల మంది హాజరు



2లో


2లో

ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

92 పట్టణ స్థానిక సంస్థల్లో ఓటింగ్ పూర్తి

తుది పోలింగ్ శాతం సోమవారం ప్రకటిస్తామన్న ఎన్నికల సంఘం

నవంబర్ 3న ఓట్ల లెక్కింపు.. 10,262 మంది అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న ఓటర్లు

మోడీ పీఠం కూల్చే వరకు విశ్రమించం

● దేశంలో 20 కోట్ల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర ● 'రాంలీలా' వేదిక సందేశాన్ని గ్రామాలకు తీసుకెళ్లండి: సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు



న్యూఢిల్లీ,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): నరేంద్ర మోడీని ఓడించేందుకు కాంగ్రెస్ వానర సైన్యం పోరాడుతోందని, ఈ పోరాటంలో విజయం సాధించే వరకు విశ్రమించబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. తెలంగాణ నుంచి వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను వానర సైన్యంగా అభివర్ణించారు. 'ఓట్ బచావోదేశ్ బచావో' నినాదంతో బీజేపీ నేతలకు గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. రాంలీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ సందేశాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి మోడీ రెండుసార్లు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేయాలని భావించారని విమర్శించారు. అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును తొలగించేందుకు ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికే 13.50 కోట్ల ఓట్లు తొలగించారని, మరో 20 కోట్ల ఓట్లు తొలగించేందుకు కుట్ర జరుగుతోందని అన్నారు. ఓట్ల తొలగింపు ద్వారా బీజేపీ పలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ 'ఓట్ బచావోదేశ్ బచావో' ర్యాలీ రాబోయే సార్వత్రిక ఎన్నికలకు నాంది అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ చేస్తున్న పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మిగతా2లో...

పోలింగ్ కేంద్రాల్లో ప్రజాస్వామ్యం ఖూనీ: జగన్

● ఓటర్ల అడ్డగింత.. వైసీపీ ఏజెంట్లు, అభ్యర్థులపై దాడులు ● బూత్‌లలో ఏజెంట్లు లేకుండా ఎన్నికలా? మీడియాపైనా దాడులు జరిగాయి: జగన్


2లో

రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణం: కేటీఆర్

కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయకపోవడంతోనే రాష్ట్రంలో కరవు పరిస్థితులు

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శ



ఆదిలాబాద్,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడినవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, ముందు చూపు లేని పాలన ఫలితమని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో లక్షలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. సుమారు 35 లక్షల ఎకరాల్లో వానాకాలం పంటకు నష్టం వాటిల్లిందని, 750 టీఎంసీల నీటిని వృథాగా మిగతా2లో...


2లో

ఓబీసీ కులగణనపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి

ఆదివాసీల మత నమోదుకు ప్రత్యేక కాలమ్ కోసం తీర్మానం చేయాలి.. సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ

ఢిల్లీ వీధుల్లో ఇండియా కూటమి గర్జన!

న్యూఢిల్లీ,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): ఇండియా కూటమి నిర్వహించిన 'ఓట్ బచావోదేశ్ బచావో' భారీ బహిరంగ సభతో ఢిల్లీ జనసంద్రమైంది. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు, నిరసనకారులతో రాంలీలా మైదానం, కన్నాట్ ప్లేస్ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. మధ్యాహ్నం మింటో రోడ్ జంక్షన్ నుంచి సభా ప్రాంగణం వరకు నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. 'ఓట్ బచావోదేశ్ బచావో', 'ఓట్ చోర్‌గద్దీ ఛోడ్' నినాదాలతో మద్దతుదారులు హోరెత్తించారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తదితర నేతలు ఓపెన్ టాప్ వాహనాల్లో ర్యాలీకి చేరుకున్నారు. ప్రియాంకాగాంధీ, ఫరూక్ అబ్దుల్లా, తేజస్వి యాదవ్, సంజయ్ రౌత్, సుప్రియా సూలే తదితరులు కూడా పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా వివిధ రాష్ట్రాల మద్దతుదారులు సంప్రదాయ దుస్తులు, జానపద నృత్యాలు, డప్పు వాయిద్యాలతో నిరసన తెలిపారు. **తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలింపు** సభకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 8 వేల మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఢిల్లీకి చేరుకున్నారు. దీంతో తెలంగాణ, ఏపీ భవన్‌లు కిటకిటలాడాయి. తెలంగాణ భవన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ భవన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ సమయంలో సీపీఐ నేత డి. రాజా అస్వస్థతకు గురికాగా, రాహుల్‌గాంధీ తన కాన్వాయ్‌ను నిలిపి ఆయనను ఆస్పత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. భారీ సభ నేపథ్యంలో ఢిల్లీ వ్యాప్తంగా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సుమారు 10 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు.

ముగిసిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్

అమరావతి,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో 92 పట్టణ స్థానిక సంస్థలకు ఆదివారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసింది. రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 79 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటలకు పూర్తయింది. నిర్ణీత సమయానికి పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో ఉన్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 99.35 లక్షల మంది ఓటర్ల కోసం 11,378 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటల వరకు 48.03 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా వెల్లడించారు. సాయంత్రం 5 గంటల తర్వాత పోలింగ్ సిబ్బంది నుంచి పూర్తి వివరాలు అందిన అనంతరం తుది పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తామని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ 55వ డివిజన్‌లో సాంకేతిక కారణాలతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడంతో రాత్రి 7.30 గంటల వరకు ఓటింగ్‌కు అనుమతించారు. **చెదురుమదురు ఘటనలు.. 275 కేసులు** కడప, కర్నూలు, పల్నాడు, అనంతపురం జిల్లాల్లో కొన్ని చోట్ల స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ సందర్భంగా సుమారు 40 ఘటనలు నమోదైనట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు 275 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు వెల్లడించారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, ఆధారాల మేరకు చర్యలు తీసుకుంటామని ఎన్నికల కమిషనర్ స్పష్టం చేశారు.**3న ఓట్ల లెక్కింపు** ఈ ఎన్నికల్లో మేయర్, చైర్‌పర్సన్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసిన 10,262 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ పెట్టెల్లో భద్రంగా ఉంది. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ప్రజాస్వామ్యం ఖూనీ: జగన్

ఓటర్ల అడ్డగింత.. వైసీపీ ఏజెంట్లు, అభ్యర్థులపై దాడులు

బూత్‌లలో ఏజెంట్లు లేకుండా ఎన్నికలా?

మీడియాపైనా దాడులు జరిగాయి: జగన్



పులివెందుల,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): పోలీసుల సహకారంతో టీడీపీ నాయకులు పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేస్తున్నారని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు లేకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఆదివారం పులివెందుల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తన నివాసంలో మీడియాతో మాట్లాడారు.తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే పలు పోలింగ్ కేంద్రాలను టీడీపీ కార్యకర్తలు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. వైసీపీ ఏజెంట్లను కేంద్రాల్లోకి అనుమతించడం లేదని, ఓటు వేసేందుకు వచ్చిన వారిని ఇప్పటికే ఓటు వేశారంటూ వెనక్కి పంపుతున్నారని తెలిపారు. వైసీపీ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీలమ్మపై దాడి చేశారని, కౌన్సిలర్ అభ్యర్థులను పోలీసులు స్టేషన్‌కు తరలించారని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులపైనా దాడులు జరిగినట్లు ఆరోపించారు.ఈ ఘటనలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు జగన్ తెలిపారు. సుమారు 70 మంది ఏజెంట్లతో కలిసి మున్సిపల్ రిటర్నింగ్ అధికారిని కలసి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. పులివెందులతో పాటు కడప, జమ్మలమడుగు, మదనపల్లె, తాడిపత్రి, చీమకుర్తి మున్సిపాలిటీల్లోనూ దౌర్జన్యాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పేర్కొంటూ, ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుపై జగన్ తీవ్ర విమర్శలు చేశారు.

మురసు తుఫాన్ ఎఫెక్ట్.. తెలంగాణకు భారీ వర్ష సూచన!

ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.. మరో ఐదు జిల్లాలకు ఎల్లో అలర్ట్

హైదరాబాద్‌లోనూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం



హైదరాబాద్,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తుఫాన్ ప్రభావంతో తెలంగాణలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పటికే అక్టోబర్ 28న 'అర్నబ్' తుఫాన్ తీరం దాటగా, వారం రోజులు గడవకముందే మరో తుఫాన్ ప్రభావం రాష్ట్రంపై పడనుంది. సోమ, మంగళవారాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది.**ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్** మురసు తుఫాన్ ప్రభావంతో ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.**మంగళవారం అత్యంత భారీ వర్షాలు**మురసు తుఫాన్ నెల్లూరునర్సాపూర్ మధ్య దక్షిణ కోస్తాంధ్ర తీరాన్ని సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయంలోపు దాటే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. తీరాన్ని దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో, గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది. మంగళవారం ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. **హైదరాబాద్‌లోనూ వర్షాలు**రాజధాని హైదరాబాద్‌లో వచ్చే 48 గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. బుధ, గురువారాల్లోనూ పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగవచ్చని వెల్లడించింది. ప్రజలు వాతావరణ శాఖ సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

దీపావళికి ముందే ధరల బాదుడు

న్యూఢిల్లీ, నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్):దీపావళి పండుగకు ముందే వాణిజ్య గ్యాస్ ధరలు పెరిగాయి. 19 కిలోల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్‌పై రూ.10 పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. నవంబర్ 1 నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. దీంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ.2,820కు, హైదరాబాద్‌లో రూ.3,065కు చేరింది. వరుసగా మూడు నెలలుగా ధరలు పెరుగుతుండటంతో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై అదనపు భారం పడనుంది. గృహావసరాల వంటగ్యాస్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.

నవంబర్‌లోనూ ఎండల తీవ్రత

న్యూఢిల్లీ,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్):దేశంలో నవంబర్ నెలలోనూ ఎండల తీవ్రత కొనసాగనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. సాధారణంగా ఈ సమయంలో చలి ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని అంచనా వేసింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా పలు ప్రాంతాల్లో అధికంగా ఉండనున్నాయని తెలిపింది. అక్టోబర్ 31న విడుదల చేసిన నెలవారీ వాతావరణ అంచనాల ప్రకారం హిమాలయ పర్వత ప్రాంతాల దిగువన ఉన్న కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా చోట్ల ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. మరోవైపు నవంబర్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. దీర్ఘకాల సగటు వర్షపాతంలో కేవలం 77 శాతం మాత్రమే నమోదయ్యే సూచనలు ఉన్నాయని పేర్కొంది. దక్షిణ భారతదేశంలోనూ ఇదే పరిస్థితి ఉండనుందని, సాధారణంగా 118.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే ప్రాంతంలో ఈసారి 77 శాతం మాత్రమే వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో బలమైన ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నాయని, నవంబర్, డిసెంబర్ నెలల్లోనూ ఇవి కొనసాగవచ్చని తెలిపింది. ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాల్లో తీవ్ర కరవు, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ వివరించింది.

దెబ్బతిన్న 48 గంటల్లో విద్యుత్ పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

సరఫరాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఉన్నతాధికారులతో ఆదివారం సమీక్ష నిర్వహించారు. అవసరమైతే తెలంగాణ, తమిళనాడు నుంచి అదనపు సిబ్బంది, పరికరాలను తెప్పించాలని సూచించారు. ఇప్పటికే తెలంగాణ నుంచి 500 మంది సిబ్బంది వచ్చినట్లు మంత్రి తెలిపారు. తమిళనాడు కూడా సహకరించేందుకు అంగీకరించిందన్నారు.తుఫాను సహాయక చర్యల కోసం తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. విద్యుత్ పునరుద్ధరణకు సిబ్బంది, యంత్రాలు పంపాలని కోరారు. సోమవారం నుంచి ప్రతి నాలుగు నుంచి ఆరు గంటలకు తుఫాను పరిస్థితులపై బులెటిన్లు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు.

మోడీ పీఠం కూల్చే వరకు విశ్రమించం

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాలకు అనుగుణంగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా సవరణ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఓటు చోరీ వ్యవహారంలో ప్రధాని మోడీ పాత్ర ఉందని ఆరోపించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సైతం ఓటర్ల జాబితాలో అక్రమాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపు మేరకు ఢిల్లీలో నిర్వహించిన తెలంగాణ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

సముద్రంలోకి వదిలేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని కేటీఆర్ ఆరోపించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు ఏటా రూ.15 వేల పెట్టుబడి సాయం, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. మరోవైపు యూరియా కొరత, విద్యుత్ సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. సాగునీరు, పెట్టుబడి సాయం, ఎరువులు సకాలంలో అందక రైతులు నష్టాల పాలవుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు సభకు ముందు కేటీఆర్ నేరడిగొండ, తలమడుగు మండలాల్లో ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. రైతుల సంక్షేమం, సాగునీటి సమస్యలు, పంట నష్టాలకు పరిహారం వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ రైతు గర్జన సభలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఓబీసీ కులగణనపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలి

● ఆదివాసీల మత నమోదుకు ప్రత్యేక కాలమ్ కోసం తీర్మానం చేయాలి.. సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

హైదరాబాద్,నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్):జనగణనలో ఓబీసీల కులగణన కోసం ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని, ఆదివాసీల మత నమోదుకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆది వారం బహిరంగ లేఖ రాశారు. డిసెంబర్ నుంచి ఇంటింటి జనగణన ప్రారంభం కానున్న నేపథ్య ంలో ఈ అంశాలపై చర్చించేందుకు రాష్ట్ర శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఓబీసీల జనాభాపై చట్టబద్ధమైన లెక్కలు లేకపోవడంతో వారికి జనాభా దామా షా ప్రకారం ప్రయోజనాలు అందడం లేదని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీల తరహాలో ఓబీసీల జనాభాను కూడా ప్రత్యేకంగా లెక్కించాలని సూచించారు. అలాగే ఆదివాసీల ప్రత్యేక జీవనశైలి, సంప్రదా యాలను గుర్తించి వారి మత నమోదుకు జనగణనలో ప్రత్యేక కాలమ్ కల్పించాలని కోరారు. ఈ రెండు అంశాలపై వేర్వేరు తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కవిత తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు డ్రైవ్‌కు విశేష స్పందన

బర్కత్‌పురా హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఘనంగా ఓటరు నమోదు కార్యక్రమం

అర్హులైన ప్రతి పట్టభద్రుడూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపు



కాచిగూడ, నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): రాబోయే శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. హైదరాబాద్ బర్కత్‌పురా లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఆదివారం నిర్వహించిన ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్ నమోదు డ్రైవ్ అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది.బీఆర్ఎస్ బర్కత్‌పురా డివిజన్ ఇంచార్జి డాక్టర్ బి. శిరీష ఓంప్రకాశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు డాక్టర్ బద్దుల ఓంప్రకాశ్ యాదవ్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని అనేకమంది పట్టభద్రులు, యువతీయువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి, తమ విద్యార్హత పత్రాలను అందించి ఓటర్లుగా పేర్లను నమోదు చేసుకున్నారు.**ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది:** కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సెంట్రల్ పీస్ కమిటీ సికింద్రాబాద్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్. శరత్ శ్యామ్, కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. శేష్ నారాయణ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన సాధనమని స్పష్టం చేశారు. డిగ్రీ లేదా దానికి సమానమైన అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, చైతన్యవంతమైన సమాజ నిర్మాణంలో పట్టభద్రుల పాత్ర కీలకమని ఈ సందర్భంగా వారు ఉద్ఘాటించారు. అర్హత ఉన్న ఏ ఒక్క గ్రాడ్యుయేట్ కూడా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోకుండా ఉండిపోకూడదని పిలుపునిచ్చారు.కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ శిరీష, డాక్టర్ ఓంప్రకాశ్ యాదవ్ మాట్లాడుతూ... స్థానిక పట్టభద్రులకు ఓటరు నమోదులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఫారాలు నింపడం నుండి ఆన్‌లైన్ అప్‌లోడ్ వరకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని. అంబర్ పేట నియోజకవర్గంలోని గ్రాడ్యుయేట్లు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ నాయకులు ఆర్.ఎల్.వి. ప్రసాద్, డాక్టర్ విజయ్ మోహన్, డాక్టర్ బసవరాజ్, పిల్లి యాదయ్య, సి. శ్రీకాంత్, రాఘవేంద్ర కులకర్ణి, మొలుగు చంద్రశేఖర్ రెడ్డి, డి. రాజ్‌కుమార్, కుర్రి కిరణ్, కే. శ్రవణ్ తో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక నివాసితులు, పట్టభద్రులు మరియు కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం.. హక్కుల సాధనే టీజేఎఫ్ లక్ష్యం....

సమిష్టి కృషితోనే సమస్యలకు పరిష్కారం....

జర్నలిస్టుల ఉద్యమ స్ఫూర్తి అల్లం నారాయణ...

జిల్లాలో 1,200 అక్రిడిటేషన్ కార్డుల మంజూరు

టీజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ,చిర్రా రవి





ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్): జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీజేఎఫ్) నిరంతరం పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ పేర్కొన్నారు. సమిష్టి కృషి, ఐక్యతతోనే జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో నినాదం పత్రిక ఆక్రిడేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నాయకత్వం ఎల్లప్పుడూ ముందుండి పోరాడాలని సూచించారు. జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీజేఎఫ్ కీలక పాత్ర పోషించిందని, అల్లం నారాయణ నాయకత్వంలో కొద్దిమందితో ప్రారంభమైన సంఘం నేడు రాష్ట్రవ్యాప్తంగా బలమైన జర్నలిస్టు సంఘంగా ఎదిగిందని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో టీజేఎఫ్‌కు ఒక్కరి ప్రాతినిధ్యం మాత్రమే ఉన్నప్పటికీ, చిన్నా పెద్దా పత్రికలనే తారతమ్యం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ కార్డు మంజూరు చేయాలనే లక్ష్యంతో పోరాడామని తెలిపారు. అధికారులతో దశలవారీగా చర్చలు జరుపుతూ సమన్వయంతో వ్యవహరించడం ద్వారా జిల్లాలో 1,200 అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు కృషి చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్తంభమైన జర్నలిస్టులు ప్రజల పక్షాన నిలిచినప్పుడే పాత్రికేయ వృత్తికి నిజమైన గౌరవం లభిస్తుందని అన్నారు. పరిశోధనాత్మక వార్తలతో ప్రజా సమస్యలను, అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకురావడంలో ఆదినారాయణ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఆయన నాయకత్వంలో టీజేఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నినాదం పత్రిక జిల్లా, మండల స్థాయి రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, నినాదం బ్యూరో ఇన్‌చార్జి బిక్కి గోపి, స్టాఫర్ నరసింహారావు, సంగమేశ్వర ప్రసాద్, సత్తుపల్లి ఆర్ సి ఇంచార్జీ ధూపాటి నరేష్ రాజు, వెంకయ్య, పాషా, మహేష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

5న కరీంనగర్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాక

గాంధీ బొమ్మ నుంచి కమాన్ వరకు మహా పాదయాత్ర.. 50 వేల మందితో జన సమీకరణకు బండి సంజయ్ సన్నాహాలు



కరీంనగర్, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్): ఈ నెల 5న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కరీంనగర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గాంధీ బొమ్మ నుంచి కమాన్ వరకు భారీ పాదయాత్ర నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. వైశ్య భవన్, టవర్ సర్కిల్, శాస్త్రీ రోడ్డు మీదుగా కమాన్ వరకు సాగే ఈ యాత్రకు పెద్దఎత్తున ప్రజలను సమీకరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ నిర్ణయించారు. సుమారు 50 వేల మందితో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.కరీంనగర్ నేతలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.. అరాచకాన్ని తరిమికొడదాం అనే నినాదంతో హైదరాబాద్, కరీంనగర్‌లో భారీ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఓటర్ల జాబితాలో మరణించినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉన్నవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారి వివరాలను సరిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కార్యకర్తలు, నాయకులు తమ స్థాయికి తగినట్లుగా జన సమీకరణ చేయాలని, డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. పార్టీ నాయకులు ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేయాలని, అనుమతులు, భూ వ్యవహారాలు, దుకాణాల వద్ద డబ్బులు వసూలు చేయడం వంటి ఆరోపణలకు తావివ్వకూడదని హెచ్చరించారు. ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ సునీల్‌రావు, మాజీ మేయర్ డి. శంకర్, బాస సత్యనారాయణ, నల్లాల ఓదేలు, కోమల ఆంజనేయులు, గుజ్జ శ్రీను, రమేశ్, బోయినిపల్లి ప్రవీణ్‌రావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి లక్ష సంతకాల ఉద్యమం

- **సాగునీటి ప్రాజెక్టుల సాధనకు జేఏసీ కార్యాచరణ**



షాద్ నగర్, నవంబర్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన లక్ష సంతకాల మహోద్యమం షాద్‌నగర్‌లో జోరుగా కొనసాగుతోంది. పండుగ సాయన్న స్ఫూర్తితో పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం షాద్‌నగర్ బస్టాండ్ ఆవరణలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. షాద్‌నగర్ జేఏసీ కన్వీనర్ టీజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లభించింది. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే ఉమ్మడి జిల్లాలోని రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొంటూ పలువురు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు. పెండింగ్ పనులను ప్రభుత్వం వెంటనే చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల భాగస్వామ్యంతో లక్ష సంతకాల లక్ష్యాన్ని చేరుకుంటామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ కో-ఆర్డినేటర్ రవీంద్రనాథ్, కో-కన్వీనర్ అర్జునప్ప, కార్యనిర్వాహక సభ్యులు ఆకాష్ నాయక్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో మోసం.. బీటెక్ విద్యార్థిని మృతికి కారణమైన యువకుడు అరెస్ట్

- **వారం రోజుల్లోనే కేసు మిస్టరీని ఛేదించిన పరకాల పోలీసులు**


పరకాల, నవంబర్ 01 (పిసిడబ్ల్యూ న్యూస్): పరకాల మండలం నాగారం గ్రామంలో బీటెక్ విద్యార్థిని అఖిల అనుమానాస్పద మృతి కేసును పరకాల పోలీసులు వారం రోజుల్లోనే ఛేదించారు. అదే గ్రామానికి చెందిన కుక్కల రక్షిత్ ప్రేమ పేరుతో మోసం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన అఖిల ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అన్ని కోణాల్లో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఆదేశాల మేరకు జైలుకు తరలించారు. విద్యార్థిని మృతికి దారితీసిన పరిణామాలను వెలుగులోకి తీసుకొచ్చి, వారం రోజుల్లోనే కేసును ఛేదించడం ద్వారా పరకాల పోలీసులు దర్యాప్తులో వేగం ప్రదర్శించారు. ప్రేమ పేరుతో మోసాలకు పాల్పడితే చట్టపరమైన పరిణామాలు తప్పవనే విషయం ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన

- **జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**







ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్): 'జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్' ఉచిత వైద్య శిబిరం కు విశేష స్పందన లభించింది.కాలేయ ఆరోగ్యంపై అవగాహన - 100 మందికి ఉచిత హెపటైటిస్-బి టీకాల పంపిణీ చేపట్టారు.కాలేయ సంబంధిత వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా "జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హెపటైటిస్-బి టీకా లివర్ ఫైబ్రోస్కాన్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్ జంగాల (ఎండి డి ఎం) డాక్టర్ స్వాతి జంగాల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ శిబిరానికి విచ్చేసిన 100 మంది బాధితులకు ఉచితంగా వైద్య పరీక్షలు కన్సల్టేషన్ నిర్వహించారు. ఫైబ్రోస్కాన్ 50 నిర్వహించారు మొత్తం 31 మందికి ప్రాణాంతక హెపటైటిస్-బి నుండి రక్షణ కల్పించేలా ఉచిత టీకాలను వేయడం జరిగింది. శిబిరంలో జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ద్వారా టీకాలు కిట్లు వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన అనేకమంది రోగులు వైద్య శిబిరానికి తరలిరావడం విశేషం. ఈ వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. డాక్టర్ జంగాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందం నిర్వహిస్తున్న వైద్య శిబిరం కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

అర్హులైన ఓటరును జాబితాలో ఉండేలా చూడాలి: మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



సత్తుపల్లి, నవంబర్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుల ఓటర్ ను జాబితాలో ఉండే విధంగా చూడాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సత్తుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఎదురైతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. అక్కడ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు బాధ్యతతో కృషి చేయాలని సండ్ర వెంకటవీరయ్య కోరారు.

ఆకుల వెంకటేశ్వర్లు సేవలు చిరస్మరణీయం

- **కుటుంబానికి అండగా ఉంటాం: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర**





ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్): సమాజ సేవలో ప్రత్యేక గుర్తింపు పొందిన ధంసలాపురం మాజీ సర్పంచ్ స్వర్గీయ ఆకుల వెంకటేశ్వర్లు సేవలు చిరస్మరణీయమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఆదివారం సీతారాంపురం (అగ్రహారం)లోని ఆయన స్వగృహంలో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో మున్నూరుకాపు ప్రముఖులతో కలిసి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన సతీమణి లక్ష్మి, కుమారుడు సుందరయ్యలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు ప్రముఖులు పారా నాగేశ్వరరావు, ఆకుతోట ఆదినారాయణ, తోట రమేష్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

క్వాలీలో ఇద్దరు యువకులు గల్లంతు!

- నీటిలో పడిన ప్లేట్లను తీసేందుకు దిగి ప్రమాదంలో చిక్కుకున్న వైనం



జవహర్‌నగర్, నవంబర్ 1 (బీసీడబ్ల్యూ న్యూస్):
స్నేహితులతో సరదాగా గడిపేందుకు క్వారీ వద్దకు వెళ్లిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యారు. యాప్రాల్ పరిధిలోని మల్కారం క్వారీలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. యాప్రాల్‌కు చెందిన రక్షిత్ (19), మురారి (19), ఫియూష్ (18), రోహిత్ (18), సయాన్ (18) కలిసి క్వారీ వద్ద వంట చేసుకుని భోజనం చేశారు. అనంతరం ప్లేట్లు శుభ్రం చేస్తుండగా కొన్ని నీటిలో పడిపోయాయి. వాటిని తీసేందుకు సయాన్, రోహిత్ నీటిలోకి దిగగా లోతు ఎక్కువగా ఉండటంతో మునిగి గల్లంతయ్యారు. మిగిలిన ముగ్గురు యువకులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డయల్ 100 ద్వారా సమాచారం అందుకున్న జవహర్‌నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం విపత్తు స్పందన దళానికి సమాచారం అందించి గాలింపు చర్యలు చేపట్టారు.

ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



హైదరాబాద్ నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్):హిమాయత్‌నగర్‌లోని డాక్టర్ సీ.ఎల్. మోడీ చారిటబుల్ హోమియోపతిక్ డిస్పెన్సరీ & స్పెషాలిటీ క్లినిక్స్ వేదికగా హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (హెచ్ మ్యాట్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు శ్రీమతి మహాలక్ష్మి రామన్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు.ముందుగా హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ మాట్లాడుతూ... సుదీర్ఘకాలంగా సమాజానికి విశేష వైద్య సేవలు అందిస్తూ, ప్రస్తుతం శాశ్వత ప్రాతిపదికన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని నిర్వహించడానికి ముందుకు వచ్చిన హెచ్ మ్యాట్ ప్రతినిధులను అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె. గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. దుర్గాప్రసాద్ రావుల కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య సేవల సమాచారాన్ని హిమాయత్‌నగర్ డివిజన్ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి తనవంతు సహకారం అందిస్తానని, స్థానికులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కె. గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ ఉచిత హోమియోపతి వైద్య శిబిరం ఇకపై ప్రతినెలా చివరి శనివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించబడుతుందని తెలిపారు. నిపుణులైన వైద్యులచే ఉచిత కన్సల్టేషన్‌తో పాటు, రోగులకు ఒక వారానికి సరిపడా మందులను ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు.ప్రారంభ శిబిరంలో సీనియర్ హోమియో వైద్యులు డాక్టర్ ఎన్.ఎస్. రఘురాం, డాక్టర్ భావనా గురునాని రోగులకు ఉచితంగా వైద్య సేవలందించారు. రానున్న రోజుల్లో ప్రతినెలా ఇద్దరు సీనియర్ హోమియో వైద్యులు రొటేషన్ పద్ధతిలో సేవలు అందిస్తారని ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. దుర్గాప్రసాద్ రావు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హెచ్‌మ్యాట్ గవర్నింగ్ కౌన్సిల్ సీనియర్ సభ్యురాలు డాక్టర్ కె. కల్పన, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎ. మాణిక్ ప్రభు, ఓపీడీ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీనిధి, హౌస్ ఫిజీషియన్ డాక్టర్ షేక్ షాహేదా, డిస్పెన్సరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట నూతన ఎస్‌హెచ్‌ఓకు బీఆర్ఎస్ మైనారిటీ నాయకుల శుభాకాంక్షలు





హైదరాబాద్, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్): అంబర్‌పేట పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన కొత్తపల్లి ముత్తును బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నాయకులతో ఆత్మీయంగా మాట్లాడిన ఎస్‌హెచ్‌ఓ, అంబర్‌పేట పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, పోలీసులకు ప్రజలకు మధ్య సమన్వయం పెంపొందించాలని సూచించారు. దీనికి స్పందించిన బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక సామరస్యం, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖకు తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ అఫ్రోజ్ పటేల్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్, షేక్ రఫీక్ అహ్మద్, షేక్ షానూర్, సయ్యద్ యూసుఫ్ బాబా, మీర్జా ఆదిల్ బేగ్, యువజన నాయకుడు మహమ్మద్ అజర్, మహమ్మద్ జమీల్ (యాబా) తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం ఐక్యత, అభివృద్ధే లక్ష్యంగా ముందడుగు!

- కరీంనగర్‌లో ఘనంగా 7వ రాష్ట్ర కార్యవర్గ సమావేశం.. 119 నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, 33 జిల్లాల ప్రతినిధుల హాజరు



కరీంనగర్, ప్రతినిధి నవంబర్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్): మున్నూరు కాపు సంఘం బలోపేతం, సామాజిక ఐక్యత, భవిష్యత్ అభివృద్ధి లక్ష్యంగా కరీంనగర్ వేదికగా నిర్వహించిన మున్నూరు కాపు సంఘం 7వ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఘనంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా సంఘం నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.ఈ సమావేశానికి మున్నూరు కాపు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్ శీలంశెట్టి వీరభద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ పసుపులేటి దేవేంద్ర తదితర రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల కోఆర్డినేటర్లు, 33 జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా సంఘం అభివృద్ధి, సభ్యుల మధ్య ఐక్యత, సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ తదితర కీలక అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. మున్నూరు కాపు సంఘం మరింత బలోపేతం కావాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేస్తూ, సమిష్టి నిర్ణయాలతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నాయకులు, కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఈ సమావేశం సంఘం ఐక్యతకు, ఐకమత్యానికి నిదర్శనంగా నిలిచింది. సమాజ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేస్తూ, సంఘం ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు.ఐక్యతే మన బలం.. సంఘటితమే మన లక్ష్యం.. మున్నూరు కాపు సమాజ అభ్యున్నతే మన ధ్యేయం! అనే సంకల్పంతో సమావేశం ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

డంపింగ్ యార్డు శాశ్వత మూసివేతకు ఐక్య పోరాటం చేయాలి!

ప్రజల ఆరోగ్యం కోసం పదవులను సైతం పణంగా పెట్టి ఉద్యమించాలి

ఈటల రాజేందర్, మల్లారెడ్డి, వజ్రేష్ యాదవ్‌లకు పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి విజ్ఞప్తి



జవహర్‌నగర్, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్): జవహర్‌నగర్ డంపింగ్ యార్డును శాశ్వతంగా మూసివేసేందుకు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి పార్టీలకు అతీతంగా ఐక్య పోరాటం చేయాలని డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, సంక్షేమం కంటే రాజకీయ పదవులు గొప్పవి కావని స్పష్టం చేశారు.ఆదివారం జవహర్‌నగర్ బాలాజీనగర్ బస్టాండ్ వద్ద భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో మహంకాళి బిక్షు నిర్వహించిన అంబేద్కర్ 123వ జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ తమ పదవులను సైతం పణంగా పెట్టి డంపింగ్ యార్డు తొలగింపు కోసం కలిసికట్టుగా ఉద్యమించాలని కోరారు.మహిళల హక్కుల కోసం హిందూ కోడ్ బిల్లుకు ఆమోదం లభించకపోవడంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆయన పోరాట స్ఫూర్తిని ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రాజ్యాంగంలోని 21వ అధికరణం కల్పించిన జీవించే హక్కులో స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కూడా భాగమని పేర్కొన్నారు. డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని యార్డును శాశ్వతంగా మూసివేయడంతో పాటు శాస్త్రీయ పద్ధతుల్లో వ్యర్థాల శుద్ధి ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. దమ్మాయిగూడ, జవహర్‌నగర్ ఐక్య కార్యాచరణ సమితులతో పాటు నాలుగు మండలాల ప్రజలు ఐక్య పోరాటం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాజ కీయ నాయకులు ఒకే వేదికపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. వెంకటాచారి, గజ్జెల రాంచందర్ ఆలపించిన పాటలు, ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఐక్య కార్యాచరణ సమితుల నాయకులు బద్రగామి ఆంజనేయులు, శివన్నారాయణ, జయసుధ, మహ్మద్ పాషామియా, గడిపే సునీత, తుమ్మరాణి, అంబాల ఎల్లయ్య, సన్వాల సుచరిత, బాలు,గడ్డంగిరి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

పని ఒత్తిడితో అధ్యాపకురాలి అకాల మరణం

● గురుకులాల్లో మార్పులు రావాలి! ● ఉపాధ్యాయులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించాలి.. ● విద్యార్థుల భవిష్యత్తుపైనే దృష్టి సారించేలా పాలనా సంస్కరణలు చేపట్టాలి ● టీఎస్ యూటీఎఫ్ గురుకులాల వింగ్ రాష్ట్ర నాయకులు దామోదర్





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) : ప్రభుత్వ ఉద్యోగం.. విద్యాబోధన అనే పవిత్రమైన బాధ్యత.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలనే తపన.. కానీ అంతకంతకూ పెరుగుతున్న పని ఒత్తిడి ఓ అధ్యాపకురాలి జీవితాన్నే బలిగొనడం అత్యంత బాధాకరమని పలువురు వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. కారేపల్లిలోని మైనార్టీ గురుకుల (వైరా బాలికల) పాఠశాల, కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకురాలిగా పనిచేస్తున్న దార సావిత్రి అధిక పని ఒత్తిడి కారణంగా మానసిక క్షోభకు గురై ఇటీవల అకాల మరణం చెందడం విద్యా వ్యవస్థలోని పని పరిస్థితులపై మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేసిందన్నారు. ఆదివారం నిర్వహించిన ఆమె సంస్మరణ సభలో వక్తలు మాట్లాడుతూ.. ఒక అధ్యాపకురాలిని కోల్పోవడం ఆమె కుటుంబానికే కాకుండా విద్యా సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.**అధ్యాపకుల ఆరోగ్యమే విద్యా వ్యవస్థకు పునాది :**తెలంగాణలోని వివిధ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అనేకమంది అధ్యాపకులు అధిక పని భారం కారణంగా శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. బోధనేతర పనులు, అదనపు బాధ్యతలు, నిరంతర విధుల ఒత్తిడి అధ్యాపకుల వ్యక్తిగత జీవితాలపై, కుటుంబాలపై కూడా ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన ఉపాధ్యాయులు అనవసరమైన పనుల ఒత్తిడిలో సతమతమైతే విద్యా ప్రమాణాలు, విద్యార్థుల భవిష్యత్తు కూడా ప్రభావితమవుతాయని గుర్తు చేశారు.ప్రభుత్వం ఈ పరిస్థితులను గంభీరంగా పరిగణించి గురుకుల విద్యా వ్యవస్థలో సమగ్ర పాలనా సంస్కరణలు తీసుకురావాలని కోరారు. అధ్యాపకులపై అదనపు పనిభారాన్ని తగ్గించి, వారు ప్రశాంతమైన వాతావరణంలో విద్యాబోధన సాగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. బోధనేతర బాధ్యతలను సాధ్యమైనంత వరకు వేరే సిబ్బందికి అప్పగించి, అధ్యాపకుల సమయం, శక్తి ప్రధానంగా విద్యార్థుల విద్యాభివృద్ధి, వారి ఉజ్వల భవిష్యత్తుకు సంబంధించిన ప్రణాళికలకే వినియోగించేలా విధానాలు రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.అధ్యాపకులపై పడే పని ఒత్తిడి కేవలం కార్యాలయానికే పరిమితం కావడం లేదని, దాని ప్రభావం వారి కుటుంబ సభ్యులపై, పిల్లలపై కూడా పడుతోందని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు వ్యక్తిగత జీవితం, కుటుంబానికి సమయం కేటాయించగలిగే ఆరోగ్యకరమైన పని వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలని కోరారు. సావిత్రి మరణం మరో కుటుంబంలో ఇలాంటి విషాదం చోటుచేసుకోకుండా విద్యా వ్యవస్థలో మార్పులకు నాంది కావాలని ఆకాంక్షించారు. ఈ సంస్మరణ సభలో టీఎస్ యూటీఎఫ్ గురుకులాల విభాగం రాష్ట్ర నాయకులు దామోదర్, మహేష్, జితేష్, క్రాంతికుమార్, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు రామదాసు, జిల్లా నాయకులు ఉద్దండు షరీఫ్, సుధాకర్, సోషల్ వెల్ఫేర్ గురుకులాల జాయింట్ సెక్రటరీ శారద, మైనార్టీ గురుకులాల ఆర్ఎల్‌సీ కె.వి. రామయ్య, ప్రిన్సిపల్ అరుణకుమారి తదితర అధ్యాపకులు, ఉపాధ్యాయ బృందం పాల్గొని దార సావిత్రికి ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాస్వామ్యంపై కాంగ్రెస్ దాడిని తిప్పికొడదాం!

దేశంలో అశాంతి సృష్టించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తోంది: బీజేపీ నాయకులు







కరీంనగర్, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్):అధికారం కోల్పోయిన నిరాశతో కాంగ్రెస్ దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ నాయకులు విమర్శించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం కరీంనగర్, మానకొండూరు, హుజూరాబాద్, చొప్పదండి నియోజకవర్గాల్లో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అరాచక శక్తులను తరిమికొడదాం' అనే నినాదంతో మేధావులు, ప్రభావశీల వ్యక్తుల సదస్సులు నిర్వహించారు.జమ్మికుంటలో జరిగిన హుజూరాబాద్ నియోజకవర్గ సదస్సులో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ అనవసర ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తోందని విమర్శించారు.మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాల సమావేశంలో మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి కన్నబోయిన ఓదెలు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే ఓటర్ల జాబితా సవరణ జరుగుతోందని తెలిపారు. బోగస్, రెండుసార్లు నమోదైన, మరణించిన వారి ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాలు అపోహలు వ్యాప్తి చేస్తున్నాయని ఆరోపించారు.కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర విభాగాల కన్వీనర్ సారంగుల అమర్‌నాథ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ఆరోపణలపై ప్రజలకు వాస్తవాలు వివరించాలని మేధావులను కోరారు.ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకట్‌రెడ్డి, గుజ్జ శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఈనుగొండ నాగేశ్వర్‌రెడ్డి, గుర్రాల వెంకటరెడ్డి, నరసింహారాజు, సంపత్‌రావు, రాపాక ప్రవీణ్, సుగుర్తి జగదీశ్వరాచారి తదితర నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో 82 ఏళ్ల వృద్ధుడు మృతి

- అతివేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఘటన..



గంగాధర, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్):కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లి గ్రామ శివారులోని పిట్టలపల్లి వై జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో 82 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. వెంకంపల్లికి చెందిన సంకటి మల్లయ్య తన ద్విచక్ర వాహనంపై మధురానగర్ ఎక్స్‌రోడ్డు వైపు వెళ్తుండగా, ఎదురుగా అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చిన స్విఫ్ట్ డిజైర్ కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మల్లయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పందిర్ల జగదీశ్వర్ శర్మగా గుర్తించారు. మృతుడి కుమార్తె కొమటిరెడ్డి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంగాధర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ ర్యాలీ

- ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసనలో పాల్గొన్న ప్రణవ్‌బాబు







న్యూఢిల్లీ/హుజూరాబాద్, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్):'ఇండియా' కూటమి, రాహుల్‌గాంధీ పిలుపు మేరకు న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన 'ఓట్ బచావోదేశ్ బచావో' నిరసన ర్యాలీలో హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నాయి. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు ఆధ్వర్యంలో కమలాపూర్ మండల నాయకులు, కార్యకర్తలు ర్యాలీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రణవ్‌బాబు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని, ఓటరు జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల హక్కులకు భంగం కలిగిస్తోందని ఆరోపించారు. ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని, ఆయన తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి పౌరుడి ఓటు హక్కును, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రజాస్వామ్యవాదులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలోనూ ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 04, 05న నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ ఉమ్మడి కరీంనగర్లో పర్యటన





కరీంనగర్, నవంబర్ 01(పిసిడబ్ల్యూ న్యూస్): ఎంఐఎం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు, ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 04న కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో, 05న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో ప్రభుత్వ ఉర్దూ మీడియం హైస్కూల్స్ లో ఎస్సెస్సీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమానికి ఎంఐఎం అధినేత బారిస్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఉర్దూ మీడియం స్కూళ్లలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు, సాలారే మిల్లత్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ రిలీఫ్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేసే ఈ ఆల్ ఇన్ వన్ గైడ్స్ ను, మోడల్ క్వశ్చన్ పేపర్లను స్వీకరించేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావాలని, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గులాం అహ్మద్ హుస్సేన్ కోరారు.

గుజరాత్‌లో ఏక్తా దివాస్ పరేడ్‌లో పాల్గొన్న

కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్





కమలాపూర్ నవంబర్ 1(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ గౌడ్ గుజరాత్ రాష్ట్రంలో జరిగిన ఏక్తా దివాస్ పరేడ్ లో పాల్గొన్నారు.భారతదేశ తొలి ఉపప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని గుజరాత్ రాష్ట్రంలోని నర్మదా జిల్లా ఏక్తా నగర్ లో నిర్వహించిన జాతీయ ఏక్తా దివాస్ పరేడ్ లో హన్మకొండ జిల్లా కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ పాల్గొన్నారు.గుజరాత్ రాష్ట్రంలోని కెవాడియా (ఏక్తానగర్) లో రాష్ట్రీయ ఏక్తా దివస్ ఉత్సవ్ కు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి ఆహ్వానితులను ఆహ్వానించారు.హన్మకొండ జిల్లా నుంచి పబ్బ సతీష్ (సర్పంచ్, కమలాపూర్),కోడిమాల శ్రీనివాసరావు (పూర్వ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్), ఉత్తమరాజు వికాస్(సమాజ సేవకుడు), ఒంటెల నికితాంజలి (వ్యాపార రంగం), సాయికిరణ్ రాథోడ్(విద్యార్థి కేయూ)ఎంపికైన వీరంతా గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి నోడల్ ఆఫీసర్ ఆరెపల్లి సుమన్ ఆధ్వర్యంలో గుజరాత్ కు తరలివెళ్లి స్టాట్యూ ఆఫ్ యూనిటీ(సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం) సందర్శించి శుక్ర, శనివారం రెండు రోజుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరైన వేడుకల్లో వీరు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. వేడుకల అంతరం ఆదివారం వారు హనుమకొండ కు తిరుగు ప్రయాణం అయ్యారు.ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించిన హన్మకొండ జిల్లా కలెక్టర్ చహత్ భాజ్ పాయ్ కు, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత రెడ్డి కు, పలు శాఖల అధికారులకు,కేంద్ర ప్రభుత్వం, గుజరాత్ ప్రభుత్వంకు సర్పంచ్ పబ్బు సతీష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాకు ఈ అరుదైన గౌరవం పొందే వేడుకల్లో ఆహ్వానితులు గా పాల్గొనడం గొప్ప అవకాశంగా భావిస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమం తో మా టీం సభ్యులకు దేశం,సమాజం పట్ల మా బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఢిల్లీ రామ్ లీలా మైదానంలో 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నిరసన ర్యాలీ


- పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ



న్యూఢిల్లీ, నవంబర్ 1(పిసి డబ్ల్యూ న్యూస్): ఢిల్లీ రామ్ లీలా మైదానంలో ఈరోజు నిర్వహిస్తున్న 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నిరసన ర్యాలీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.ఓటు హక్కును కాపాడుకుంటూ దేశ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ నిరసన ర్యాలీకి దేశవ్యాప్తంగా ప్రజల నుండి భారీ మద్దతు లభిస్తోంది.

డిప్యూటీ ఈఈగా పదోన్నతి.. విశిష్ట సేవా పురస్కారం


- కడారి వెంకటేశ్వర్లుకు ఘన సన్మానం
- పడమటి లోకవరం గ్రామానికి గర్వకారణం



కల్లూరు, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్) :పంచాయతీరాజ్ శాఖలో ఏఈగా విధులు నిర్వహిస్తూ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డిప్యూటీ ఈఈ)గా పదోన్నతి పొంది వైరాకు బదిలీపై వెళ్లిన పడమటి లోకవరం గ్రామానికి చెందిన కడారి వెంకటేశ్వర్లుకు గ్రామస్థులు ఘనంగా సన్మానం చేశారు. ఆయనకు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య విశిష్ట సేవా పురస్కారం 2026 లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆదివారం పడమటి లోకవరం గ్రామంలో మాజీ సర్పంచ్ కళ్యాణపు కొండలరావు, 9వ వార్డు మహిళా కౌన్సిలర్ కళ్యాణపు నవ్య దంపతుల ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే తన సొంత గ్రామమైన పడమటి లోకవరం అభివృద్ధికి వెంకటేశ్వర్లు ఎల్లప్పుడూ సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన విశిష్ట సేవా పురస్కారం లభించడం గ్రామానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహిస్తూ, ప్రజలకు మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కడారి వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

కోతుల నుంచి పంటను కాపాడుకునేందుకు పెట్టిన విద్యుత్ ఉచ్చు..

- రైతునే బలితీసుకుంది...!
- కురవి మండలం నల్లెల్లలో విషాదం



కురవి నవంబర్ 01(పిసిడబ్లూ న్యూస్): కోతుల బెడద నుంచి తన పంటను కాపాడుకుందామని రైతు వేసిన ఎత్తుగడే అతని ప్రాణాలను బలితీసుకున్న విషాద ఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం నల్లెల్ల గ్రామంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే... నల్లెల్ల గ్రామానికి చెందిన రైతు పల్లా రాంరెడ్డి తనకున్న 8 ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట ఏపుగా పెరుగుతున్న తరుణంలో కోతులు గుంపులుగా వచ్చి పంటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో తట్టుకోలేని రాంరెడ్డి తన పొలం చుట్టూ రక్షణ కోసం అక్రమంగా విద్యుత్ తీగను ఏర్పాటు చేశాడు.శనివారం కోతులు ఆ విద్యుత్ తీగకు తగలడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి, తీగ తెగి రైతు నడిచే బాట వరకు పడిపోయింది. విద్యుత్ ప్రవహిస్తున్న విషయాన్ని గమనించని రైతు రాంరెడ్డి ప్రమాదవశాత్తు ఆ తీగను తొక్కడంతో అక్కడికక్కడే విద్యుదాఘాతంతో మృతి చెందాడు.దాంతో నల్లెల్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనా స్థలానికి చేరుకున్న సీరోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంటల రక్షణ పేరుతో ఇలా ప్రాణాలకు తెగించి అక్రమ విద్యుత్ తీగలు ఏర్పాటు చేయవద్దని విద్యుత్ శాఖ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

36 ఏళ్ల నిస్వార్థ సేవకు కన్నీటి వీడ్కోలు

● తెలంగాణ ఉద్యమంలో మన్నెపల్లి వెంకటేశ్వరరావు పాత్ర చిరస్మరణీయం: ఏలూరి శ్రీనివాసరావు







ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్):ట్రెజరీ శాఖలో 36 ఏళ్లపాటు అంకితభావంతో సేవలందించి, సహచర ఉద్యోగుల అభిమానం పొందిన మన్నెపల్లి వెంకటేశ్వరరావు గుండెపోటుతో అకాల మరణం చెందడం ఉద్యోగ లోకానికి తీరని లోటని టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఈ జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం వెంకటేశ్వరరావు స్వగృహంలో ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ సబ్ ట్రెజరీ అధికారిగా పదవీ విరమణ చేసిన వెంకటేశ్వరరావు విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలనకు ప్రాధాన్యమిచ్చారని కొనియాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతూ సహచరులకు ఆప్తుడిగా నిలిచారని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సకల జనుల సమ్మెతో పాటు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని, ఆయన ఉద్యమ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన అకాల మరణం ఉద్యోగ సంఘాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఓ, టీఎన్జీవో నాయకులు, ట్రెజరీ శాఖ అధికారులు, ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పాల్గొని నివాళులర్పించారు.

లూథరన్ చర్చిలో వైసీపీ నేతల ప్రత్యేక ప్రార్థనలు

- చర్చి నూతన మందిర నిర్మాణానికి రూ.2.50 లక్షల విరాళం ప్రకటన

రైల్వేకోడూరు, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్): రైల్వేకోడూరు పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలో ఉన్న లూథరన్ చర్చిలో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్ ఆశీస్సులు తీసుకుని, సంఘ సభ్యులను కలుసుకున్నారు. రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన అభ్యర్థులకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.అనంతరం చర్చి నూతన మందిర నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు రూ.లక్ష, రామిరెడ్డి ధ్వజారెడ్డి రూ.లక్ష, జడ్పీటీసీ అభ్యర్థి అంబటి మురళి రూ.50 వేలు విరాళంగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సీహెచ్ రమేష్, పత్తి పెంచలయ్య, ప్రతాప్ రెడ్డి, రాజా (గని), ఇనమాల మహేష్, గండా సురేందర్ రెడ్డి, విష్ణేష్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్): కర్నూలు జిల్లా పరిధిలోని నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఆదివారం కర్నూలు నగరంతో పాటు ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరులోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.కర్నూలు కార్పొరేషన్ పరిధిలో గుర్తించిన 25 అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు, సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌తో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఘర్షణలను నివారించేందుకు స్ట్రైకింగ్ ఫోర్సెస్, క్విక్ రియాక్షన్ టీమ్‌లు నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నాయని తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నాయని, అల్లర్లకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకుని, ఓటు వేసిన వెంటనే ఇళ్లకు వెళ్లాలని కోరారు.ఎస్పీ వెంట డీఎస్పీ రాఘవేంద్ర, పలువురు సీఐలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అక్రమ ఎన్నికల ప్రక్రియకు ఆమోదముద్ర వేయలేను

- రీపోలింగ్ నిర్వహిస్తేనే ఓటు వేస్తా: వైఎస్ జగన్



పులివెందుల నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్): పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఎన్నికల ప్రక్రియపై నిరసనగా ఓటింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, పులివెందులలో ఎన్నికల పరిస్థితులు అప్రజాస్వామికంగా మారాయని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటు వేస్తే ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగిందనే భావన కలుగుతుందని, అందుకే ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. న్యాయంగా, నిష్పక్షపాతంగా రీపోలింగ్ నిర్వహిస్తేనే తాను ఓటు వేస్తానని స్పష్టం చేశారు.ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల నిర్వహణపై న్యాయస్థానాలను ఆశ్రయించి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయపోరాటం చేస్తామని జగన్ పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం

● సామినేని రామారావు హత్యలో అసలైన నిందితులను అరెస్టు చేయాలి.. కరవు నివారణ చర్యలు చేపట్టాలి



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 1 (పీసీడబ్ల్యూ న్యూస్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు స్పష్టం చేశారు. ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో కళ్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఓటరు జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపు జరిగిందని ఆరోపించారు. రైతు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సామినేని రామారావు హత్య కేసులో అసలైన నిందితులను వెంటనే అరెస్టు చేసి, సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో కరవు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు, వ్యవసాయ కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం చెల్లించాలని, ధరలను నియంత్రించి ప్రతి రేషన్ కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. నవంబర్ 15న నల్లగొండలో నిర్వహించనున్న అఖిల భారత రైతు మహాసభకు ఖమ్మం జిల్లా నుంచి 10 వేల మందిని తరలించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు, కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ అభ్యర్థి కొల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సామాజిక న్యాయానికి కులగణనే కీలకం

- జనగణనలో బీసీ ఉపకులాల వారీగా సమగ్ర లెక్కలు చేపట్టాలి

- హక్కుల సాధనకు బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) : కేంద్ర ప్రభుత్వం 2027లో చేపట్టనున్న జనగణనలో బీసీ కులగణనను తప్పనిసరిగా చేపట్టాలని, బీసీ ఉపకులాల వారీగా జనాభా వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్య, వైద్యం, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తగిన అవకాశాలు, హక్కులు, రిజర్వేషన్లు కల్పించేందుకు కులగణన ఎంతో కీలకమని స్పష్టం చేశారు.బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని మున్నూరుకాపు కార్యాలయంలో జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేశ జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీ కులాల వాస్తవ జనాభా వివరాలు అందుబాటులో లేకపోవడం వల్ల సామాజిక న్యాయం, అభివృద్ధి ఫలాలు, విద్యా, ఉద్యోగ అవకాశాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2027 జనగణనలో బీసీల జనాభాను మాత్రమే కాకుండా, ప్రతి బీసీ ఉపకులానికి సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా సేకరించాలని నాయకులు కోరారు. బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా సంక్షేమ పథకాలు, విద్యా, ఉద్యోగ అవకాశాలు, రిజర్వేషన్లు కల్పించేందుకు కులగణన ప్రామాణికంగా నిలుస్తుందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా సామాజిక, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటున్న బీసీ వర్గాలకు న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన అత్యవసరమని స్పష్టం చేశారు.బీసీల హక్కుల సాధన ఏ ఒక్క సంఘానికో, ఒక వర్గానికో పరిమితమైన అంశం కాదని, అన్ని బీసీ కులాలు, ఉపకులాలు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కులాల మధ్య విభేదాలకు తావులేకుండా సామాజిక న్యాయం అనే ఉమ్మడి లక్ష్యంతో ఐక్య ఉద్యమాన్ని నిర్మించాలని అన్నారు. ఈ డిమాండ్‌ను జాతీయ స్థాయికి తీసుకెళ్లి, దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులను కలిసి బీసీ కులగణన ఆవశ్యకతను వివరించి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని ప్రకటించారు.ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు శింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్షులు మేకల శ్రీనివాసరావు, బీసీ జేఏసీ ఛైర్మన్ పాల్వంచ రామారావు, వివిధ సంఘాల నాయకులు పెళ్లూరి విజయ్‌కుమార్, పెరుగు వెంకటరమణ యాదవ్, సీహెచ్ రమేష్, తాటి నిర్మల, తమ్మిశెట్టి వెంకటరాజు, కత్తి నెహ్రూ గౌడ్, లిక్కి కృష్ణారావు, సుంకర శ్రీనివాస్, లింగబోయిన పుల్లారావు, రావుల హన్మంతరావు, గాదె లక్ష్మీనారాయణ, చేతుల నాగేశ్వరరావు, పగడాల అనంతరాములు, టి. పోతురాజు పాల్గొన్నారు.

గనులు, భూముల దోపిడీకి కాంగ్రెస్ పాలనలో ఊతం!

బుగ్గపాడు ఫుడ్ పార్క్ భూముల కేటాయింపులో భారీ కుంభకోణం.. బినామీల బండారం బయటపెడతాం

రైతులను గాలికొదిలేసి ఉచిత సలహాలిస్తున్న ముఖ్యమంత్రి.. బీజేపీ జాతీయ నేత డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి ధ్వజం



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 1 (పిసిడబ్ల్యూ న్యూస్) :రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం గనులు, భూములు, ఇసుక వనరులను అడ్డగోలుగా కొల్లగొడుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతోందని బీజేపీ జాతీయ నాయకుడు, తమిళనాడు సహ ఇన్‌ఛార్జి, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పొంగులేటి సుధాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కాంట్రాక్టులు, భూముల కేటాయింపుల పేరుతో రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు.ఆదివారం ఖమ్మంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలోని బుగ్గపాడు ఫుడ్ పార్క్ భూముల కేటాయింపులో భారీ కుంభకోణం చోటుచేసుకుందని ఆరోపించారు. కేవలం రూ.22 కోట్ల టర్నోవర్ కలిగిన దీపక్ నెటిజెన్ కంపెనీకి 72 ఎకరాల విలువైన భూమిని ఎకరాకు కేవలం రూ.25 లక్షల చొప్పున అవుట్‌రైట్ సేల్ కింద కట్టబెట్టడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న బినామీలెవరో ప్రభుత్వం తక్షణమే వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ భూముల కేటాయింపుపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచే వరకు బీజేపీ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.సింగరేణి బొగ్గు గనుల్లో భారీ అవినీతి జరుగుతోందని, ఇందుకు సంబంధించి తన వద్ద పక్కా సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ అక్రమాలపై ఐదు గంటల పాటు వివరంగా మాట్లాడగలిగే ఆధారాలు తన వద్ద ఉన్నాయని, త్వరలోనే అన్ని విషయాలను బహిర్గతం చేస్తానని హెచ్చరించారు.ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, వారిని ఆదుకోవాల్సిన ముఖ్యమంత్రి పంటలు వేయొద్దంటూ ఉచిత సలహాలు ఇవ్వడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నా రైతాంగానికి న్యాయం జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల పాలన, విధానాల్లో పెద్దగా తేడా లేదని, అవి ఒకే నాణేనికి బొమ్మా బొరుసు వంటివని వ్యాఖ్యానించారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు రుణమాఫీ వంటి హామీలను విస్మరించిందని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లోనూ అర్హులకు కాకుండా పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. ఇప్పటివరకు ఇళ్లను ఎవరెవరికి కేటాయించారో ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని సవాల్ విసిరారు.దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలుపుతోందని సుధాకర్ రెడ్డి ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తుంటే, కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిరాధార ఆరోపణలతో రాజకీయ విమర్శలకు దిగుతున్నారని అన్నారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఎన్నికల సంఘాన్ని ప్రశంసిస్తూ, ఓటమి ఎదురైనప్పుడు ఈవీఎంలపై నిందలు వేయడం విపక్షాల ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. కేరళలో కాంగ్రెస్‌తో పోరాడుతున్న కమ్యూనిస్టులు తెలంగాణలో మాత్రం రాజకీయ పొత్తుల కోసం సిద్ధాంతాలను పక్కనపెడుతున్నారని విమర్శించారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చారని, 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' నినాదంతో దేశాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు యువత, నిరుద్యోగులు సిద్ధమవుతున్నా రని అన్నారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు బీజేపీకి మద్దతుగా నిలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే పార్టీ అభ్యర్థిని ప్రకటిస్తామని, భారీ మెజారిటీతో విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.నల్గొండ ఇన్‌ఛార్జి సన్నీ ఉదయ్ ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఐవీ రమేష్, రుద్ర ప్రదీప్, పాలేరు బీజేపీ అభ్యర్థి నున్నా రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు వీరల్లి రాజేష్, ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జిల్లా మోర్చా అధ్యక్షురాలు మంద సరస్వతి, రీగన్, ఐటీ కన్వీనర్ బోయినపల్లి సురేష్, మీడియా కన్వీనర్ కృష్ణ, కుమిలి శ్రీనివాస్, రుద్రగాని మాధవ్, శ్రీలక్ష్మీరెడ్డి, గడిల నరేష్, వంశీ వెంకటనారాయణ, మహేందర్ సింగ్, కోటి హనుమంతరావు, యువమోర్చా అధ్యక్షుడు శాసనాల సాయిరామ్ పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో అసైన్డ్ భూముల భూదందా..

అధికారులకు కనిపించడం లేదా.?

వరుస కథనాలు వెలువడుతున్నా కదలని రెవెన్యూ యంత్రాంగం

స్థానిక రెవెన్యూ అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు మౌనం ఎందుకు.?

కలెక్టర్‌కు వాస్తవాలు చేరుతున్నాయా.? లేక సమాచారం మధ్యలోనే ఆగిపోతోందా.?

హైదరాబాదు, నవంబర్ 01 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగానిది. అసైన్డ్ భూములు, మాజీ సైనికులకు కేటాయించిన భూములు, ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు చోటుచేసుకుంటే వెంటనే స్పందించి భూములను పరిరక్షించాల్సిన బాధ్యత స్థానిక రెవెన్యూ అధికారుల నుంచి జిల్లా ఉన్నతాధికారుకు, కలెక్టర్ వరకు ఉంటుంది. కానీ జవహర్‌నగర్ పరిధిలోని భూముల వ్యవహారాన్ని పరిశీలిస్తే ఈ బాధ్యతలు కేవలం కాగితాలకే పరిమితమవు తున్నాయా.? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జవహర్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్ ప్రాంతంలో సర్వే నంబర్లు 499, 500కు సంబంధించి ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, మాజీ సైనికులకు సంబంధించిన భూముల కబ్జాపై గతంలోనూ పలు కథనాలు వెలువడ్డాయి. సుమారు 4.30 ఎకరాల భూమికి సంబంధించి నకిలీ పత్రాలు, నోటరీ డాక్యుమెంట్లు సృష్టించి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. 80 గజాల చొప్పున ప్లాట్లు చేసి ఒక్కో ప్లాట్‌ను రూ. 30 లక్షల వరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. **వార్తలు వస్తున్నాయి, అధికారులు స్పందించరెందుకు.?**జవహర్ నగర్ లో ప్రభుత్వ భూముల వ్యవహారంపై ఇప్పటికే పలు సందర్భాల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. గతంలో అక్రమ నిర్మాణాలు, కంచెలు, హెచ్చరిక బోర్డులు, భూముల క్రయవిక్రయాలపై కూడా చర్చ జరిగింది. ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మాణాలు చేస్తే వాటికి మీటర్లు ఇవ్వడం ఇంటి నెంబర్లు ఇవ్వడం వెనుక భారీ స్థాయిలో అక్రమాలు జరిగినాయి అని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన కలెక్టర్ మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఈ భూముల అసలు స్వరూపం ఏమిటి.? అవి ప్రభుత్వ భూములా.? అసైన్డ్ భూములా.? మాజీ సైనికులకు కేటాయించిన భూములా.? ప్రైవేటు పట్టా భూములా.? అనే అంశాలపై సమగ్ర అధికారిక నివేదిక ప్రజల ముందుకు రాకపోవడం వెనుక కాప్రా సర్కిల్ ఎమ్మార్వో, ఆర్డీవోల హస్తం ఉందన్న అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఒకసారి వార్త వస్తే సంబంధిత అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలి. రెండోసారి వార్త వచ్చినా స్పందన లేకపోతే ఉన్నతాధికారులు సమీక్షించాలి. కానీ వరుస కథనాలు వెలువడుతున్నా స్థానిక రెవెన్యూ యంత్రాంగంలో కనీస స్థాయిలో కదలిక కనిపించకపోవడంపై రెవిన్యూ అధికారులకు భారీగా మామూళ్లు అందాయా.? అన్న



అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. **కలెక్టర్‌కు సమాచారం చేరడం లేదా.?**జవహర్ నగర్ భూ కుంభకోణం పై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు సంబంధించినది. ఒక ప్రాంతంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై వరుసగా వార్తలు వస్తున్నప్పుడు స్థానిక రెవెన్యూ అధికారులు వాటిని జిల్లా ఉన్నతాధికారుల, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నారా? క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను తహసీల్దార్, ఆర్డీవో స్థాయి అధికారులు కలెక్టర్‌కు నివేదిస్తున్నారా.? ఒకవేళ నివేదిస్తే కలెక్టర్ మౌనం వహించడం ఏమిటి.? తదుపరి చర్యలు ఎందుకు కనిపించడం లేదు.? అన్న సందేహాలు ప్రజలలో తీవ్రంగా వ్యక్తమవుతున్నాయి. స్థానిక స్థాయిలోనే ఈ వ్యవహారానికి సంబంధించిన సమాచారం నిలిచిపోతోందా.? క్షేత్రస్థాయి వాస్తవాలు జిల్లా కలెక్టర్‌కు చేరకుండా ఎవరైనా అడ్డుకుంటున్నారా.? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. **సర్వే నంబర్ 500లో అసలు భూమి ఎంత.?** సర్వే నంబర్ 500లో సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గతంలో ప్రస్తావ-నకు వచ్చింది. అందులో వివాదాస్పదంగా మారిన భూమి ఎంత.? ప్రస్తుతం ఎవరెవరి ఆధీనంలో ఉంది.? గతంలో జరిగిన లావాదేవీలు ఏంటి.? ప్రస్తుత జరుగుతున్న నిర్మాణాలపై కాప్రా సర్కిల్ ఎమ్మార్వో మౌనమేందుకు.? మాజీ సైనికులకు సంబంధించిన భూముల రికార్డులు ఏమి చెబుతున్నాయి.? సంబంధిత భూములకు ఎలాంటి పట్టాలు, కేటాయింపులు జరిగాయి.? వాటి ఆధారంగా ప్రస్తుతం జరుగుతున్న క్రయవిక్రయాలు చట్టబద్ధమైనవేనా.? అనే అంశాలపై సమగ్ర సర్వే నిర్వహించాల్సిన అవసరం కలెక్టర్ పై ఉంది.గతంలో స్థానిక రెవెన్యూ అధికారి ఈ భూములపై క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, రెవెన్యూ రికార్డులను తనిఖీ చేస్తామని తెలిపినట్లు సమాచారం. మరి ఆ పరిశీలన జరిగిందా.? జరిగితే దాని ఫలితం ఏమిటి.? అక్రమాలు ఉన్నట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు.? అన్న వివరాలు ఆర్డీవో వెల్లడించాల్సి ఉంది.**కలెక్టర్ నేరుగా విచారణకు ఆదేశిస్తారా.?**ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జవహర్ నగర్ అసైన్డ్ భూముల వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సర్వే నంబర్లు 499, 500కు సంబంధించిన భూముల సమగ్ర సర్వే నిర్వహించి, పాత రికార్డులు, పట్టాదారు వివరాలు, అసైన్డ్ భూముల కేటాయింపులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, నోటరీ డాక్యుమెంట్లు, ప్రస్తుత ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలి. అవసరమైతే రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో సంయుక్త విచారణ జరిపించాలి.అంతేకాకుండా గతంలో ఈ భూములపై వచ్చిన ఫిర్యాదులు, వార్తా కథనాలు, స్థానిక అధికారులు చేసిన పరిశీలనలు, ఉన్నతాధికారులకు పంపిన నివేదికలను కూడా పరిశీలించాలి. సంబంధిత అధికారులు తమ పరిధిలో జరుగుతున్న పరిణామాలపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను బహిర్గతం చేయాలి.ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిని పట్టించు కోకపోవడం కూడా ప్రజల్లో అనేక అనుమానాలకు కారణ మవుతుంది. వార్తలు రాస్తేనే అధికారులు స్పందించాలా.? లేక ప్రజాధనాన్ని, ప్రభుత్వ భూములను కాపాడటం అధికారుల విధు ల్లో భాగం కాదా.? ప్రభుత్వ భూముల కబ్జాలు జరుగుతుంటే వాళ్లతో చేతులు కలిపి వాటాలు తీసుకుంటున్నారా.? అన్నది ఇప్పుడు జవహర్‌నగర్ ప్రజల నుంచి వినిపిస్తున్న ప్రశ్న. ఈ భూవ్య వహారంపై జిల్లా కలెక్టర్ స్వయంగా దృష్టి సారించి వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తారా.? లేక మరో కథనం వచ్చే వరకు



రెవెన్యూ యంత్రాంగం మౌనంగానే ఉంటుందా.? వేచి చూడాలి.



పేద కుటుంబాలకు మూడు కుట్టు మిషన్ల పంపిణీ

- స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి: వుయ్ హెల్ప్ యు ట్రస్ట్

కె.వి.పల్లి, నవంబర్ 01 (పిసిడబ్ల్యూ న్యూస్):పేద కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించి మహిళలు స్వయం ఉపాధి పొందాలనే లక్ష్యంతో వుయ్ హెల్ప్ యు ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. పీలేరు నియోజకవర్గం కె.వి.పల్లి మండలం గోరంట్లపల్లి పంచాయతీ పరిధిలోని కమ్మిరెడ్డిగారిపల్లి ఎస్టీ కాలనీలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి రమణ ఆధ్వర్యంలో, ఎం.వి. సతీష్ సహకారంతో లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు.ఈ సందర్భంగా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ, మహిళలు కుట్టు పనుల ద్వారా ఇంటి వద్దే ఆదాయం పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ నిరుపేద కుటుంబాలకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.కుట్టు మిషన్లు అందుకున్న మహిళలు ట్రస్ట్ నిర్వాహకులకు, దాత ఎం.వి. సతీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ సుశీల, జనరల్ సెక్రటరీ వులస రూప, సభ్యుడు సిబ్బాలా నాగరాజు, కాలనీవాసులు, ట్రస్ట్ సభ్యులు, యానాది సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

పులివెందులలో పోలింగ్ వేళ ఉద్రిక్తత

పలుచోట్ల ఘర్షణలు!

వాహనాలకు నిప్పు.. చైర్మన్ అభ్యర్థి కారుపై రాళ్లదాడి

ఓటు హక్కు కోసం రోడ్డెక్కిన ఓటర్లు

టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదాలు

పోలీసుల జోక్యంతో అదుపులోకి పరిస్థితులు

పులివెందుల, నవంబర్ 01 (పిసిడబ్ల్యూ న్యూస్): పులివెందుల మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా పట్టణంలో పలు చోట్ల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలకు నిప్పంటించిన ఘటనతో ప్రారంభమైన అలజడి, ఆదివారం పోలింగ్ సమయంలో ఘర్షణలు, రాళ్లదాడులు, ఓటర్ల నిరసనలతో మరింత తీవ్రరూపం దాల్చింది. పలు పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకోగా, ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన కొందరు ఓటర్లు కూడా నిరసనలకు దిగారు. దీంతో పోలీసులు పలుచోట్ల జోక్యం చేసుకుని పరిస్థితులను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు.పట్టణంలోని శిల్పారామం సమీపంలో ఉన్న ఓ తోటలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వాహనాలకు నిప్పంటించారు. ఉలిమెల గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డికి చెందిన పొలంలోని నివాసం వద్ద నిలిపి ఉంచిన 11 ద్విచక్ర వాహనాలు, మూడు కార్లు, ఒక ట్రాక్టర్ ట్రాలీకి నిప్పు పెట్టారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే సుమారు ఎనిమిది వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఆదివారం పోలింగ్ సందర్భంగా బాలికల



జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వెళ్లిన వైసీపీ చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీల కారుపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. చైర్మన్ అభ్యర్థి తరఫున జనరల్ ఏజెంట్‌గా ఉన్న కొమ్మద్ది నరసింహారెడ్డిపై కూడా దాడి జరిగినట్లు సమాచారం. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.ఎర్రగుడిపాలెంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించడం లేదంటూ నిరసన వ్యక్తమైంది. దీంతో వైసీపీ నేత చవ్వా దుష్యంత్ రెడ్డి, చైర్మన్ అభ్యర్థి వైఎస్ ప్రమీల అక్కడికి చేరుకుని ఓటర్లను అనుమతించాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. సమాచారం అందుకున్న సీఐ నరసింహులు, ఎస్ఐ తిమోతి అక్కడికి చేరుకుని ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి పంపిస్తామని, నాయకులు అక్కడి నుంచి వెళ్లాలని సూచించారు. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించడంతో దుష్యంత్ రెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం పోలీసులు ఓటర్లను ఓటు వేసేందుకు అనుమతించారు.జేఎన్టీయూ సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద జయమ్మ కాలనీ, కొండారెడ్డి కాలనీలకు చెందిన మహిళలు తమను ఓటు వేసేందుకు అనుమతించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున గుంపులుగా ఉండకూడదని పోలీసులు సూచించారు. ఇద్దరు, ముగ్గురి చొప్పున వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ క్రమంలో దాదాపు గంటకు పైగా వాగ్వాదం కొనసాగింది.గాడిచర్ల వారి వీధిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 8, 9, 10 పోలింగ్ కేంద్రాల వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయులు పరస్పరం రాళ్లు రువ్వుకున్నట్లు సమాచారం. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.

చిన్నన్న రూముల వద్ద వైసీపీ ఏజెంట్ సునందను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించకపోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో సునంద కిందపడటంతో ఆమె కుడిచేతికి ఫ్రాక్చర్ అయినట్లు సమాచారం.అహోబిలాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద కూడా ఓటర్లు తమకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.




3 వేల మంది న్యాయ సలహాదారులా.. స్వచ్ఛంద ఉద్యమం చేపట్టనున్న ధనుష్

తమిళనాడు రాజకీయాల గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తుంది. ఇటీవలే సొంతంగా పార్టీ ప్రారంభించి అఖండమైన మేజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు విజయ్ దళపతి. ఇప్పుడు ఆయన దారిలో మరో హీరో ధనుష్ సైతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హీరో త్వరలోనే రాజకీయ ప్రవేశం చేయనున్నారనే ప్రచారం తమిళనాడు సినీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. ఇప్పటివరకు ఈ విషయం పై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ నెట్టింట మాత్రం రోజుకో వార్త హల్చల్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా మరో న్యూస్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న టాక్ ప్రకారం ధనుష్ అభిమాన సంఘాన్ని స్వచ్ఛంద సంస్థగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది న్యాయసలహాదారులను నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆన స్వచ్ఛంద సంస్థ 234 నియోజకవర్గాల కోసం ఏసీ సౌకర్యాలతో కూడిన ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతుందని ప్రచారం జరుగుతుంది.అభిమాన సంఘం ఒక స్వచ్ఛంద సంస్థగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో, రాజకీయ మార్గంలో భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు సమాచారం. మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ వీరిని నియమిస్తే, ప్రతి నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో న్యాయ సలహాదారులు అందుబాటులో ఉంటారని అంటున్నారు. భవిష్యత్తులో ధనుష్ స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులపై ఉన్న కేసులను పరిష్కరించడంలో, నిరసనల సమయంలో తలెత్తే చట్టపరమైన సమస్యలలో, స్థానిక సమస్యలలో వారు సహాయపడవచ్చని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇటీవల, ధనుష్ స్వచ్ఛంద సంస్థ వరుసగా అనేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా, అక్టోబర్ 15, 2026న, ఫ్యాన్ క్లబ్‌ను స్వచ్ఛంద సంస్థగా మార్చి, ఒక జెండా , లోగోను ఆవిష్కరించారు.ని తర్వాత, అక్టోబర్ 18, 2026న జరిగిన మహిళా బృంద నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న 3,000 మందికి పైగా మహిళా నిర్వాహకులకు ఒక్కొక్కరికి 20 గ్రాముల వెండి దీపాన్ని బహూకరించారు. దీని తర్వాత, జనవరి 2027 నుండి మొత్తం 234 నియోజకవర్గాలలో 10వ, ప్లస్ 2 విద్యార్థుల కోసం ఏసీ సౌకర్యాలతో ఉచిత ట్యూషన్ కేంద్రాలను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు ప్రకటించారు. దీనిలో భాగంగా, ఆయన ఢిల్లీలోని ప్రముఖులను కలిశారని, కొత్త పార్టీకి పేరు నమోదు చేశారని వార్తలు వస్తున్నాయి. అయితే, వీటిలో ఏదీ అధికారికంగా ధృవీకరించబడలేదు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్, రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ముందు, తన అభిమాన సంఘాలను 'విజయ్ మక్కల్ ఉద్యమం'గా మార్చి ప్రతి జిల్లాలో సంక్షేమ సహాయం అందించారు. ఆ తర్వాత, ఆయన పార్టీని ప్రారంభించి, తాను పోటీ చేసిన మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. ధనుష్ కూడా అభిమాన సంఘాన్ని ఒక ఉద్యమంగా మార్చడం, నియోజకవర్గాల వారీగా నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం, ప్రజా సంక్షేమ పనుల్లో నిమగ్నమవడం వంటి అదే మార్గాన్ని అనుసరించడం ప్రారంభించారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తన రాజకీయ ప్రవేశంపై ధనుష్ ఇప్పటివరకు స్పందించలేదు.



11 సినిమాలతో మొదలై.. స్పెషల్ సాంగ్స్‌తో సెన్సేషన్..

సినిమా ఇండస్ట్రీలో అందం, అభినయంతో గుర్తింపు తెచ్చుకునే హీరోయిన్లు కొందరైతే.. గ్లామర్‌తో పాటు స్పెషల్ సాంగ్స్ ద్వారా భారీ క్రేజ్ సంపాదించుకునే భామలు మరికొందరు. ముఖ్యంగా ఒకప్పుడు హీరోయిన్‌గా సినిమాలు చేసినప్పటికీ, ఆ తర్వాత ఐటమ్ సాంగ్స్‌తో ప్రేక్షకులకు మరింత దగ్గరైన నటీమణులు చాలామంది ఉన్నారు. అలాంటి వారిలో బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌటేలా ఒకరు. సినిమాల కంటే ప్రత్యేక పాటలు, గ్లామరస్ లుక్స్, సోషల్ మీడియా పోస్టులతో ఎక్కువగా వైరల్ అవుతుంది. ఊర్వశి రౌటేలా పేరు వినగానే చాలామందికి గుర్తొచ్చేది ఆమె గ్లామరస్ లుక్స్. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన ఈ భామ, అందాల పోటీల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకుంది.చిన్న వయసులోనే ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఊర్వశి మిస్ టీన్ ఇండియా టైటిల్‌తో పాటు పలు అందాల పోటీల్లో విజయాలు అందుకుంది. 2015లో మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమెకు మోడలింగ్ రంగంలో మరిన్ని అవకాశాలు వచ్చాయి. 2013లో వచ్చిన సింగ్ సాబ్ ది గ్రేట్ సినిమాతో ఊర్వశి వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత సనం రే, గ్రేట్ గ్రాండ్ మస్తీ, హేట్ స్టోరీ 4, పాగల్‌పంతీ వంటి సినిమాల్లో నటించింది. అయితే హీరోయిన్‌గా ఆశించిన స్థాయిలో వరుస విజయాలు అందుకోలేకపోయింది. చిన్న వయసులోనే ఫ్యాషన్ రంగంలోకి అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఊర్వశి మిస్ టీన్ ఇండియా టైటిల్‌తో పాటు పలు అందాల పోటీల్లో విజయాలు అందుకుంది. 2015లో మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొని అందరి దృష్టిని ఆకర్షించింది. దీంతో ఆమెకు మోడలింగ్ రంగంలో మరిన్ని అవకాశాలు వచ్చాయి. 2013లో వచ్చిన సింగ్ సాబ్ ది గ్రేట్ సినిమాతో ఊర్వశి వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత సనం రే, గ్రేట్ గ్రాండ్ మస్తీ, హేట్ స్టోరీ 4, పాగల్‌పంతీ వంటి సినిమాల్లో నటించింది. అయితే హీరోయిన్‌గా ఆశించిన స్థాయిలో వరుస విజయాలు అందుకోలేకపోయింది. హీరోయిన్‌గా సినిమాలు చేస్తున్న సమయంలోనే ప్రత్యేక పాటల్లో కనిపించడం ప్రారంభించింది. హసీనో కా దీవానా, బాస్ పార్టీ, వైల్డ్ సాలా, కల్ట్ మామా వంటి పాటల్లో తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా సౌత్ ఇండియన్ సినిమాల్లో చేసిన స్పెషల్ అపియరెన్స్‌లు ఆమెకు మంచి గుర్తింపు తీసుకొచ్చాయి. తెలుగు ప్రేక్షకులకు కూడా ఊర్వశి సుపరిచితమే. వాల్తేరు వీరయ్య సినిమాలో బాస్ పార్టీ పాటతో పాటు ఏజెంట్, బ్రో, స్కంద సినిమాల్లో ప్రత్యేక పాటలు, పాత్రల్లో కనిపించింది. బాలకృష్ణ నటించిన డాకు మహారాజ్ సినిమాలోనూ కీలక పాత్ర పోషించి తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. ఊర్వశి కెరీర్‌ను గమనిస్తే ఆమె కేవలం ఐటమ్ సాంగ్స్‌కే పరిమితం కాలేదని తెలుస్తుంది.





రామ్ చరణ్, సుకుమార్ సినిమా ముహూర్తం ఫిక్స్..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ , సక్సెస్ ఫుల్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అంటెసిపేటెడ్ ప్రాజెక్ట్ '=జ 17' (వర్కింగ్ టైటిల్). ఈ సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అప్పట్లో బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించిన 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో అభిమానుల్లో ఆసక్తి తారాస్థాయికి చేరింది. అంతేకాదు కొన్ని రోజులుగా ఈ మూవీకి సంబంధించి ఎన్నో విషయాలు అటు ఫిల్మ్ వర్గాల్లో, ఇటు సోషల్ మీడియాలో హల్చల్ చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమా ప్రారంభానికి ఎట్టకేలకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభం కానుంది. మరుసటి రోజు నుంచే ఈ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు టాక్.కాగా, సినిమా పూజా కార్యక్రమానికి కొన్ని గంటల ముందు దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతూ మెగా ఫ్యాన్స్‌లో జోష్ నింపుతోంది. "సుక్కు భార్యగా ఈ ప్రాజెక్ట్ విషయంలో నేను ఎంతగానో గర్వపడుతున్నాను. ఆయన ఈ స్క్రిప్ట్ కోసం పడ్డ కష్టం, వెచ్చించిన సమయం నాకు తెలుసు. అందరికీ ఇష్టమైన ఈ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటం చాలా ప్రత్యేకమైన విషయం. ఈ ప్రయాణం ఎలా సాగుతుందో చూడాలనుకుంటున్నాను" అంటూ తబిత తన ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. అంతేకాకుండా రామ్ చరణ్, సుకుమార్‌లకు ఎలివేషన్ ఇస్తూ ఆమె షేర్ చేసిన వీడియోకు అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ యాడ్ చేయడం విశేషం.ఈ సినిమాకు సంబంధించి టెక్నీషియన్ల విషయంలోనూ ఆసక్తికర మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు సుకుమార్ సినిమాలన్నింటికీ దేవిశ్రీ ప్రసాద్ (ణవజఱ ూతీఱ్రాతీఱ్ఱఱఎ) సంగీతం అందించగా.. ఈ చిత్రానికి మాత్రం ఆయన స్థానంలో సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ బాధ్యతలు చేపట్టారు. మైత్రీ మూవీ మేకర్స్ , సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్



ఆమె అందమే వేరయా.. వయసు పెరుగుతున్న చెక్కు చెదరని సౌందర్యం..

దక్షిణాది సినీ పరిశ్రమలో 'లేడీ సూపర్‌స్టార్'గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న అందాల తార నయనతార గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన పని లేదు. దశాబ్దాలుగా టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్ అనే తేడా లేకుండా అన్ని భాషల్లోనూ స్టార్ హీరోల సరసన నటిస్తూ తన హవా కొనసాగిస్తున్నారు. కేవలం సినిమాల పరంగానే కాకుండా, సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే నయన్.. తన లేటెస్ట్ ఫొటోషూట్స్, వ్యక్తిగత విశేషాలను అభిమానులతో పంచుకుంటూ అభిమానులకు దగ్గరగా ఉంటారు.తాజాగా ఆమె షేర్ చేసిన బ్లాక్ కలర్ అవుట్‌ఫిట్ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో నయనతార బ్లాక్ కలర్ ఆఫ్-షోల్డర్ డ్రెస్‌లో అత్యంత స్టైలిష్‌గా, గ్లామరస్‌గా కనిపిస్తూ కుర్రకారును ఫిదా చేస్తున్నారు. లూజ్ హెయిర్‌స్టైల్, సింపుల్ మేకప్ , ఆమె క్యారీ చేసిన విధానం చూస్తుంటే ఫ్యాషన్ ప్రపంచంలో ఆమెకు ఉన్న టేస్ట్ ఎలాంటిదో స్పష్టమవుతుంది. తాజాగా ఆమె షేర్ చేసిన బ్లాక్ కలర్ అవుట్‌ఫిట్ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో నయనతార బ్లాక్ కలర్ ఆఫ్-షోల్డర్ డ్రెస్‌లో అత్యంత స్టైలిష్‌గా, గ్లామరస్‌గా కనిపిస్తూ కుర్రకారును ఫిదా చేస్తున్నారు. లూజ్ హెయిర్‌స్టైల్, సింపుల్ మేకప్ , ఆమె క్యారీ చేసిన విధానం చూస్తుంటే ఫ్యాషన్ ప్రపంచంలో ఆమెకు ఉన్న టేస్ట్ ఎలాంటిదో స్పష్టమవుతుంది.కెమెరా ముందు ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు ఈ పిక్స్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ఆమె అందం మరింత రెట్టింపు అవుతోందని, ట్రెండింగ్ లుక్స్‌తో ఆమె యూత్‌కు గట్టి పోటీ ఇస్తున్నారని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. మలయాళ చిత్రంతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన నయనతార.. తెలుగులో విక్టరీ వెంకటేష్ సరసన 'లక్ష్మి', 'తులసి', నటసింహం నందమూరి బాలకృష్ణతో 'శ్రీరామరాజ్యం' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు.కెమెరా ముందు ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు ఈ పిక్స్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. వయసు పెరుగుతున్న కొద్దీ ఆమె అందం మరింత రెట్టింపు అవుతోందని, ట్రెండింగ్ లుక్స్‌తో ఆమె యూత్‌కు గట్టి పోటీ ఇస్తున్నారని అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. మలయాళ చిత్రంతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించిన నయనతార.. తెలుగులో విక్టరీ వెంకటేష్ సరసన 'లక్ష్మి', 'తులసి', నటసింహం నందమూరి బాలకృష్ణతో 'శ్రీరామరాజ్యం' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు.ముఖ్యంగా 'శ్రీరామరాజ్యం' చిత్రంలో సీతాదేవిగా ఆమె నటనా ప్రతిభ ప్రేక్షకులను ఎంతగానో కట్టిపడేసింది. అటు కోలీవుడ్‌లో 'మాయ', 'నానుమ్ రౌడీ దాన్', 'అరమ్' వంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో పాటు ప్రయోగాత్మక చిత్రాలు చేస్తూ తనకంటూ సపరేట్ మార్కెట్ సృష్టించుకున్నారు. కేవలం సౌత్ ఇండస్ట్రీకే పరిమితం కాకుండా, బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ సరసన 'జవాన్' చిత్రంతో హిందీలోనూ గ్రాండ్ ఎంట్రీ ఇచ్చి నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ సృష్టించారు.ముఖ్యంగా 'శ్రీరామరాజ్యం' చిత్రంలో సీతాదేవిగా ఆమె నటనా ప్రతిభ ప్రేక్షకులను ఎంతగానో కట్టిపడేసింది. అటు కోలీవుడ్‌లో 'మాయ', 'నానుమ్ రౌడీ దాన్', 'అరమ్' వంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో పాటు ప్రయోగాత్మక చిత్రాలు చేస్తూ తనకంటూ సపరేట్ మార్కెట్ సృష్టించుకున్నారు.

భోజనం చేస్తుంటే ప్రొడక్షన్ బాయ్ వచ్చి అవమానించాడు..



టాలీవుడ్ నటుడు రాజీవ్ కనకాల తన సినీ ప్రస్థానంలోని కొన్ని ఆసక్తికరమైన, కొన్ని షాకింగ్ విషయాలను ఇటీవల పంచుకున్నారు. ముఖ్యంగా, ఆయన తన తొలిరోజు షూటింగ్‌లో ఎదుర్కొన్న అవమానకరమైన సంఘటనను, మహేష్ బాబు పోకిరి సినిమాలో అవకాశం కోల్పోయిన వైనాన్ని వెల్లడించారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ, తన నటన జీవితపు తొలిరోజున ఒక ప్రొడక్షన్ బాయ్ తనను అత్యంత అవమానకరంగా మాట్లాడినట్లు గుర్తు చేసుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో, తాను చేతులు కడుక్కుంటుండగా, ఆ ప్రొడక్షన్ బాయ్ "హేయ్, బుద్ధుందా లేదా? నువ్వు ఇక్కడ కూర్చున్నావేంటి? పో ఎహే లే" అని అరిచినట్లు తెలిపారు. అప్పటికి హాస్య నటుడు ఏవిఎస్ కూడా సినీ పరిశ్రమకు కొత్త కావడంతో, ఈ సంఘటనపై ఆయన కూడా ఏమీ మాట్లాడలేకపోయారని రాజీవ్ చెప్పారు. ఈ అనుభవం నటుడిగా తన మొదటిరోజు తనకు ఎదురైన ఒక చేదు జ్ఞాపకమని వివరించారు. అంతేకాకుండా, మహేష్ బాబు నటించిన పోకిరి సినిమాలో అజయ్ పోషించిన కీలక పాత్రకు తాను మొదట ఎంపికైనట్లు రాజీవ్ కనకాల తెలిపారు. ఈ విషయం తనకు ఇటీవల సోషల్ మీడియా ద్వారానే తెలిసిందని పేర్కొన్నారు. గతంలో తను నటించిన అమ్మాయి బాగుంది సినిమాలో తన పాత్ర మరణించినందున, పోకిరిలో మళ్ళీ అలాంటి పాత్రను చేయకూడదని మహేష్ బాబు స్వయంగా సూచించారని, దీంతో అజయ్‌కు ఆ అవకాశం దక్కిందని రాజీవ్ వివరించారు. అవకాశాలు కోల్పోయినప్పుడు తాను బాధపడనని, విధిని బలంగా నమ్ముతానని, రాసిపెట్టి ఉంటే తప్పకుండా వస్తుందని రాజీవ్ చెప్పుకొచ్చారు.రాజీవ్ తన కెరీర్‌లో అత్యంత సంతృప్తినిచ్చిన పాత్రలలో విక్రమార్కుడు సినిమాలోని ఇన్స్‌పెక్టర్ పాత్రను ప్రస్తావించారు. రవితేజ పడిపోయిన తర్వాత పైకి లేచినప్పుడు, "ఇంకెవరైనా మిగిలారా?" అని అడిగినప్పుడు, రాజీవ్ కనకాల కేవలం తన ముఖ కవళికలతో "నో సార్" అన్నట్లుగా నటించిన తీరును గుర్తు చేసుకున్నారు.